# రాష్ట్రీయ స్వాస్థ్య భీమా యోజన (జాతీయ ఆరోగ్య బీమా పధకం)

**నిరుపేద ప్రజలకు ఆరోగ్య బీమా**

దారిద్ర్యరేఖదిగువననివసించేవారినిఅనారోగ్యం అనేకవిధాల కష్టనష్టాలకు గురిచేస్తుంది. అనారోగ్యం వలన వారి ఆదాయమార్గం కుంటుపడే ప్రమాదముంది. అంతేకాక, చాలా సందర్భాల్లో అనారోగ్యం వారిని అప్పుల ఊబిలోకి తోస్తుంది.

చికిత్స చేయించుకోవలసిన అవసరం తలెత్తినా, అందుకు అవసరమైన డబ్బులు లేకపోవడం వలన, జీతం పోతుందన్న భయం వలనా అనారోగ్యం ముంచుకు వచ్చేవరకూ చికిత్స గురించి పట్టించుకోరు. ఒకవేళ వారు చికిత్స చేయించుకోవాలనుకున్నా వారు దాచుకున్న ధనం ఖర్చైపోయి, ఆస్తులు కాస్తా అమ్ముకోవడం లేదా పిల్ల చదువు వంటి ఇతర ముఖ్యమైన ఖర్చులని తగ్గించుకోవలసి రావడం జరుగుతుంది. లేకుంటే వారు పెద్ద మొత్తంలో అప్పులు చేయవలసిఉంటుంది. చికిత్సను అలక్ష్యం చేస్తే అనవసరంగా బాధపడడం, ప్రాణాలుపోగోట్టుకోవడం సంభవిస్తుంది. అప్పులుచేసి, ఆస్తులమ్ముకుంటే ఆ కుటుంబం దారిద్ర్యం నుండి బయటపడే ఆశ వదులుకోవలసినదే

అయితే ఆరోగ్య బీమా ద్వారా ఈ బాధాకర పరిస్థితిని తప్పించుకోవచ్చు. ఆరోగ్య భీమాతో అనేక కుటుంబాలు ఒక కూటమిలా ఏర్పడి పెద్ద ఆరోగ్య సమస్యల వలన ఏర్పడే ముప్పును పంచుకుంటాయి.సక్రమంగా రూపకల్పనచేసి, అమలుచేసిన భీమా పథకం వైద్యసేవలను అందుబాటులోకి తేవడమే కాక, క్రమంగా వైద్య సేవల నాణ్యతను కూడా మెరుగుపరచవచ్చు.

**ఆర్.ఎస్.బి.వై. యొక్క ఆవిర్భావం**

గతంలో ప్రభుత్వం రాష్ట్ర, స్థాయిలో, జాతీయ స్థాయిలో కొంతమంది ఎంపికచేసిన లబ్ధిదారులకు ఆరోగ్య బీమా సదుపాయాన్ని కల్పించే ప్రయత్నం చేసింది. కానీ వీటిలో చాలా పథకాలు, అవి ఆశించిన మేరకు ఫలితాలు పొందలేదు. తరచూ ఈ పథకాల రూపకల్పనలోనో, అమలులోనో సమస్యలు ఎదురయ్యేవి

దీనిని దృష్టిలో ఉంచుకుని భారత దేశ ప్రభుత్వం, అంతకు ముందు ప్రవేశపెట్టిన పథకాలలోని లోపాలు సరిదిద్దడమే కాక ఇంకా ఒక అడుగు ముందుకు వేసి ప్రపంచంలోని అత్యుత్తమ పద్ధతిని ప్రవేశపెట్టింది.

ఆరోగ్య బీమా పథకాలలోని ఉత్తమ ఆచరణ పద్ధతులు, వాటిలోని లోటుపాట్లు నేర్పిన పాఠాలను తెలుసుకునే ఉద్దేశ్యంతో ప్రస్తుతం అమలులో ఉన్న, అంతకుముందున్న ఆరోగ్య బీమా పథకాలను నిశితంగా పరిశీలించడం జరిగింది. ఈ అంశాలనన్నింటిని పరిగణనలోనికి తీసుకుని, ప్రపంచంలో ఇటువంటి పరిస్థితులలో విజయవంతమైన ఇతర ఆరోగ్య బీమా పథకాల నమూనాలను సమీక్షించి రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనకు రూప కల్పనచేయడమైనది.

రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన లేదా ఆర్.ఎస్.బి.వై. 2008 ఏప్రిల్ 1 నుండి మొదలయ్యింది.

## ఆర్.ఎస్.బి.వై. అంటే ఏమిటి?

దారిద్ర్య రేఖ దిగువన ఉన్న కుటుంబాలకు ఆరోగ్య బీమా సదుపాయాన్ని వర్తింపచేయడానికి, భారత ప్రభుత్వం, కార్మిక & ఉద్యోగ మంత్రిత్వ శాఖ ఆర్.ఎస్.బి.వై. పథకాన్ని ఆవిష్కరించింది. ఆస్పత్రిలో చేర్పించవలసినటువంటి అనారోగ్య సమస్యల కారణంగా ఆర్థికంగా దెబ్బ తినే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రక్షణ కల్పించడమే ఆర్.ఎస్.బి.వై. పథకం యొక్క లక్ష్యం. ఆర్.ఎస్.బి.వై. లబ్ధిదారులకు ఆస్పత్రిలో చేర్పించవలసి వచ్చే చాలా వ్యాధులకు రూ. 30,000 /- వరకూ కవరేజీ లభిస్తుంది. చాలా రకాల వైద్యాలకు ప్రభుత్వం ఆసుపత్రి ప్యాకేజీ రేట్లను నిర్ణయించింది. మొదటి రోజునుండీ, అంతకు ముందున్న పరిస్థితులకు కూడా కవరేజీ లభిస్తుంది. వయో పరిమితి లేదు. ప్రతి కుటుంబంలో అయిదు మందికి కవరేజి లభిస్తుంది. ఇంటి యజమానికి, భార్యకు, మరియు యజమానిపై ఆధారపడ్డ ముగ్గురు వ్యక్తుల వరకూ ఈ సదుపాయం వర్తిస్తుంది. లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ రుసుముగా కేవలం రూ.30 /- చెల్లిస్తే సరిపోతుంది. ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఎంపికచేసిన భీమా సంస్థకు చెల్లిస్తాయి.

## ఆర్.ఎస్.బి.వై. యొక్క విశిష్టతలు

నిరుపేద పనివారికి ఆరోగ్య బీమా అందించడానికి భారతదేశ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలలో ఆర్.ఎస్.బి.వై. పథకం మొదటిది కాదు. కానీ ఇంతకు ముందు ప్రవేశపెట్టిన పథకాలకన్నా ఆర్.ఎస్.బి.వై. పథకం ఎన్నో విధాల భిన్నమైనది.

- **లబ్దిదారుల సాధికారత -** ఆర్.ఎస్.బి.వై. పథకం, పథకంలో పాల్గొనే పేదవారికి, వారికి నచ్చిన ప్రభుత్వ లేక ప్రైవేటు ఆసుపత్రిని ఎంచుకునే స్వేచ్ఛను కల్పిస్తుంది. ఈ పథకంద్వారా చెప్పుకోదగ్గ ఆదాయాన్ని పొందగల అవకాశమున్నందున వీరికి వైద్య సేవలందించడానికి ఆసుపత్రులు ముందుకువస్తాయి.

- **సంబంధిత వ్యక్తులకు/సంస్థలకు బిజినెస్ మోడల్ -** ఈ పథకాన్ని సామాజిక రంగానికి సరిపడే ఒక బిజినెస్ మోడల్ (వ్యాపార నమూనా) గా రూపకల్పన చేయబడింది. అంటే ఈ పథకానికి సంబంధించిన ప్రతి ఒక్క వ్యక్తికి, సంస్థకి తగిన ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇటువంటి వ్యాపార మాదిరి, ఈ పథకం యొక్క విస్తరణకి, ఎక్కువకాలం ఈ పథకం కొనసాగడానికి దోహదపడుతుంది.

  - **భీమా చేయించేవారు -** ఆర్.ఎస్.బి.వై. పథకంలో నమోదు చేయించుకున్న ఒక్కో కుటుంబానికి ప్రీమియం మొత్తం, భీమా చేయించేవారికి కట్టబడుతుంది. కాబట్టి దారిద్ర్యరేఖ దిగువన ఉన్న ప్రజలలో సాధ్యమైనన్ని కుటుంబాలను ఈ పథకంలో చేర్పించడానికి భీమా చేయించేవారు ప్రయత్నిస్తారు. తద్వారా ఈ పథకం మరింత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరుస్తుంది.

  - **ఆసుపత్రులు** – చికిత్స అందించిన ఒక్కో వ్యక్తికి చొప్పున ఆసుపత్రివారికి డబ్బు చెల్లించడం జరుగుతుంది కాబట్టి ఎక్కువ మందికి చికిత్స అందిస్తే ఆసుపత్రివారికి ఎక్కువ డబ్బు ముడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రివారికి సైతం ఈ ఆర్.ఎస్.బి.వై. పథకంకింద రోగులకు వైద్యసేవలందించినందుకుగాను ప్రోత్సాహకం ఉంటుంది. ఈ నగదు భీమా సంస్థవారి నుండి నేరుగా సంబంధిత ఆసుపత్రికి చేరడంతో, ఈ డబ్బును ఆ ఆసుపత్రికే ఖర్చుపెట్టవచ్చు. అంతేకాక, ఈ పథకంలో పాల్గొనే ఆసుపత్రులు అనవసరమైన చికిత్సలు చేయకుండా, మోసంతో ఎక్కువ మొత్తాన్ని రాబట్టకుండా భీమా సంస్థలు జాగ్రత్త తీసుకుంటూఉంటాయి.

  - **మధ్యవర్తులు -** దారిద్ర్యరేఖ దిగువన ఉండే కుటుంబాలకొరకు పనిచేసే ప్రభుత్వేతర సంస్థలు, మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఈ పథకం మధ్యవర్తులుగా చేర్చుకుంటుంది. లబ్ధిదారులను ఈ పథకంలో నమోదుచేసుకునే ప్రక్రియలో భాగంపంచుకున్నందుకుగాను వీరికి కొంత రుసుము చెల్లించబడుతుంది.

  - **ప్రభుత్వం -** ఒక్కో కుటుంబానికి, సంవత్సరానికి రూ. 750 /- కట్టడం ద్వారా ప్రభుత్వం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించగలుగుతోంది. అంతేకాక ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మధ్య ఒక ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడి, తద్వారా ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపడతాయి..

- **ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగం -** ఒక సామాజికరంగ పథకంలో ఐ.టి. వినియోగం ఇంత పెద్ద ఎత్తున చేపట్టడం ఇదే మొదటిసారి. ఈ పథకంలోని ప్రతి ఒక్క లబ్ధిదారు కుటుంబానికీ వారి వేలిముద్రలతో, ఫొటోలతో కూడిన బయోమెట్రిక్ ఎనేబుల్డ్ (వేలిముద్రలతో పనిచేసే) స్మార్ట్ కార్డులు

ఇవ్వబడతాయి. ఈ ఆర్.ఎస్.బి.వై. పథకంలో ఉన్న ఆసుపత్రులన్నింటిలో కంప్యూటర్లు ఉంటాయి. ఇవన్నీ జిల్లా స్థాయిలో ఒక సర్వర్ కంప్యూటర్ తో అనుసంధానింపబడి ఉంటాయి. దీనివలన సేవల వినియోగం గురించిన సమాచారం ఒకచోట నుండి మరోకచోటకి సులభంగా అందుతుంది.

- **సురక్షితం మరియు మోసరహితం:** బయోమెట్రిక్ ఎనేబుల్డ్ స్మార్ట్ కార్డు వినియోగం మరియు ఒక కీ మానేజ్మెంట్ సిస్టం ఈ పథకాన్ని సురక్షితంగాను, మోసరహితంగాను చేస్తాయి. ఆర్.ఎస్.బి.వై. పథకం యొక్క కీ మానేజ్మెంట్ సిస్టం, స్మార్ట్ కార్డులు అసలు వ్యక్తికి మాత్రమే చేరేలా చూస్తుంది. ఈ స్మార్ట్ కార్డులు జారీచేయడాన్ని, వాటి వినియోగాన్ని ఈ వ్యవస్థ పర్యవేక్షిస్తుంది. బయోమెట్రిక్ పద్ధతి వలన అసలు లబ్ధిదారులు మాత్రమే స్మార్ట్ కార్డును వాడగలరు.

- **పోర్టబిలిటీ** - ఆర్.ఎస్.బి.వై. పథకం యొక్క మరో ముఖ్యమైన లక్షణం ఏమిటంటే ఒక జిల్లాలో నమోదైన లబ్దిదారుడు తన స్మార్ట్ కార్డును భారతదేశంలో ఈ పథకం పరిధిలోనికి వచ్చే ఏ ఆసుపత్రిలోనైనా వినియోగించుకోవచ్చును. ఇందువలన ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలస వెళ్ళే పేద కుటుంబాలకు ఈ పథకం నిజంగా ఎంతో మేలు చేకూరుస్తుంది. వలస కార్మికులకు వారి భాగం కవరేజీ వారితో విడిగా తీసుకెళ్ళడానికి వీలుగా కార్డును విడగొట్టే సదుపాయం కూడా ఉంది.

- **నగదురహిత, కాగితరహిత లావాదేవీలు** - ఆర్.ఎస్.బి.వై. లబ్ధిదారులు డబ్బులు లేకుండా నియమిత ఆసుపత్రులలో చికిత్స పొందగలరు. వారు కేవలం వారి స్మార్ట్ కార్డును వారితో తీసుకెళ్ళి వారి వేలిముద్రలతో గుర్తింపబడాలి. ఇక వైద్యసేవలందించేవారు చికిత్సకు సంబంధించిన పత్రాలనన్నింటినీ భీమాసంస్థకు పంపనవసరం లేదు. వారు వారికి రావలసిన మొత్తం గురించిన వివరాలను కంప్యూటర్ ద్వారా పంపితే వారికి ఎలక్ట్రానిక్ పద్ధతిలో డబ్బు ముడుతుంది. ఈ విధంగా ఈ పథకం పత్రరహితమైనది.

- **పటిష్టమైన పర్యవేక్షణ & మూల్యాంకన వ్యవస్థ** - ఆర్.ఎస్.బి.వై. ఒక పటిష్టమైన పర్యవేక్షణ & మూల్యాంకన వ్యవస్థను రూపొందిస్తోంది. దేశవ్యాప్తంగా జరిగిన ఏ లావాదేవీనైనా ట్రాక్ చేసి (జాడ తీసి) నియమిత కాలాలలో విశ్లేషణా నివేదికలను అందించగల విస్తృతమైన బ్యాకెండ్ (నేపథ్య) సమాచార నిర్వహణ వ్యవస్థ ఏర్పాటులో ఉంది. ప్రభుత్వం సేకరించి, బహిర్గతం చేసిన ప్రాథమిక సమాచారం ద్వారా, మధ్య మధ్యలో ఈ పథకాన్ని మెరుగుపరిచే వీలుంది. ఈ సమాచారాన్ని, నివేదికలను ప్రచారంచేయడం అటుతర్వాత వేసే టెండర్లలో పోటీ ఏర్పడడానికి దోహదపడగలదు.